క్లుప్తంగా

ఏపీ సీఎం జగన్‌ను కలిసిన నేలకొండపల్లి వాసి



ఏపీ సీఎం జగన్‌తో కిషోర్‌బాబు

నేలకొండపల్లి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిని మండలంలోని అప్పలనరసింహాపురానికి చెందిన రేస్ పొలిటికల్ కన్సల్టెన్సీ అధినేత వెనికె కిషోర్‌బాబు బుధవారం కలిశారు. నేలకొండపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ జానకీరామయ్య కుమారుడైన కిషోర్‌బాబు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి 'మేమంతా సిద్ధం'పేరుతో బస్సుకు బయలుదేరుతున్న ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేసిన మహిళలు

ఖమ్మం మామిళ్లగూడెం: మైత్రి మహిళ సేవా సమితి, సావిత్రి మాతా సైన్యం సంయుక్త ఆధ్వర్యాన నిరుపేద కుటుంబానికి బుధవారం నిత్యావసరాల సరుకులు పంపిణీ చేశారు. ఖమ్మం త్రీటౌన్ బోస్ బొమ్మ సెంటర్‌కు చెందిన ఝాన్సీ ఇటీవల తన భర్తను కోల్పోయి నలుగురు ఆడపిల్లలతో అద్దె ఇంట్లో ఇబ్బందులు పడుతుంది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న దాతలు నెలకు సరిపడా సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రి మహిళ సేవా సమితి అధ్యక్షురాలు అన్నపూర్ణ, కె.నాగమణి, సుందరమ్మ, రంజాన్‌బీ, సావిత్రి, ఉపేంద్రబాయి, మామిడాల ఝాన్సీ, లక్ష్మి, ప్రమీల, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

కామేపల్లి: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని సాతానుగూడెం గ్రామపంచాయతీ పరిధికి చెందిన బానోతు రామనాథం కుటుంబ కలహాలతో బుధవారం పురుగుల మందు తాగాడు. దీంతో ఆయను కుటుంబీకులు ఖమ్మం తరలించి చికిత్స చేయిస్తున్నారు.

నియామకం



నియామకపత్రం అందిస్తున్న సంతోష్

నేలకొండపల్లి: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మార్తి కోటిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు యడ్లపల్లి సంతోష్ ఉత్తర్వులు జారీ చేయగా.. బుధవారం నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోటి మాట్లాడుతూ.. మండలం లో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.అనంతరం పలువురు నాయకులు ఆయనను అభినందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	ప్రేమలు
సాయిరాం	యమధీర
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	ది గోట్ లైఫ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	36	చుక్కకూర	3
బీర	46		20
దొండ	24	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	30	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం



పాలేరులో నీటిమట్టం పడిపోవడంతో అక్కడి నుంచి ఖమ్మంకు నీటి సరఫరా తగ్గింది. ప్రస్తుతం మున్నేరు, దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్, లకారం మినీట్యాంక్‌బండ్, ఖానాపురం చెరువుల ద్వారా ప్రజల అవసరాలకు నీటిని సరఫరా చేస్తున్నాం. నగర జనాభా 4 లక్షలు ఉండగా.. ఇప్పటి వరకు ఒక్కో వ్యక్తికి 150 లీటర్ల చొప్పున రోజుకు 60 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేశాం. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి లభ్యత తగ్గడంతో ఒక్కో వ్యక్తికి 100 నుంచి 120 లీటర్ల చొప్పున 45 ఎంఎల్‌డీ వరకు నీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించాం. నీటి వృథాను తగ్గించేందుకు చర్యలు చేపట్టాం. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం.

– కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

తాగునీటికి తొలి ప్రాధాన్యం..

నీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ

- నీరు వృథా కాకుండా సరఫరా
- రోజుకు 45 ఎంఎల్‌టీ వినియోగం
- బోర్లు, చేతిపంపులు, బావులపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి'తో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: వేసవిలో నెలకొన్న నీటి ఎద్దడి నేపథ్యాన.. నీటి సరఫరాకు చేపడుతున్న చర్యలపై బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి 'సాక్షి'తో మాట్లాడారు. రానున్న మూడు నెలల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి తాగునీటికి తొలి ప్రాధాన్యం కల్పించేలా కరపత్రాలను ఆవిష్కరించారు. తాగునీటిని వృథా కానివ్వకుండా.. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. తాగునీటి కొరత లేకుండా తీసుకుంటున్న చర్యలు ఆయన మాటల్లోనే..

ప్రతీ రోజు 60 ఎంఎల్‌డీ నీటి వినియోగం..

పాలేరు నుంచి ప్రతీ 15 రోజులకు 0.518 టీఎంసీల నీటిని కేఎంసీ నీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది. నగర జనాభాకు అనుగుణంగా ప్రతీరోజు మిషన్ భగీరథ ద్వారా 35 ఎంఎల్‌డీ, దానవాయిగూడెం, లకారం ఫిల్టర్ బెడ్‌ల ద్వారా 25 ఎంఎల్‌డీ చొప్పున మొత్తం 60 ఎంఎల్‌డీ నీటిని



నగర పాలక సంస్థ రూపొందించిన కరపత్రం

ప్రజలకు అందిస్తున్నాం. ప్రస్తుతం ఏర్పడిన నీటి ఎద్దడితో రోజువారీ నీటి సరఫరాను తగ్గించాం. ప్రస్తుతం 45 ఎంఎల్‌డీల నీరు విడుదలవుతోంది.

ప్రత్యామ్నాయ మార్గాలుగా బోర్లు, బావులు..

ఖమ్మం నగర పాలక సంస్థ నీటి అవసరాల కోసం రిజర్వాయర్ల నుంచి సరిపడా నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను నివేదికలు పంపించాం. అక్కడి నుంచి నీరు సరఫరా అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాం. నగరంలో 78 బోరు మోటార్లు, 522 చేతి పంపులు, 18కి పైగా బావులు ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తీసుకొస్తున్నాం. బావుల్లో నీటిని క్లోరినేషన్ చేసి తాగేందుకు సిద్ధం చేస్తున్నాం. ఇక కొత్త బోర్‌వెల్స్ ఎక్కడెక్కడ అవసరం అనేది కూడా గుర్తిస్తున్నాం.

లీజుకు వ్యవసాయ బావులు..

నగరంలో నీటి కొరత ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ఇబ్బందులు తలెత్తకుండా నీటిని సరఫరా చేసేలా చూస్తున్నాం. ఆ ప్రాంతాలకు నీటిని అందించేందుకు నగరంలో, చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బావులను లీజుకు తీసుకుని అక్కడి నుంచి నీటిని తరలించేందుకు చర్యలు చేపడుతున్నాం.

నీరు వృథా కాకుండా చర్యలు..

నగరంలో, నగరానికి నీటిని సరఫరా చేసే పైపులైన్ల లీకేజీలను గుర్తిస్తున్నాం. లీకేజీల వల్ల ఎక్కువగా నీరు వృథాగా పోతోందని మా దృష్టికి వచ్చింది. సాధ్యమైనంత త్వరగా వీటికి మరమ్మతులు చేసేలా అధికారులను ఆదేశించాం. రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేశాం. డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో నీటిని ప్రతీ రోజు సరఫరా చేసేలా ఏర్పాట్లను చేశాం. నీటిని వృథా చేయొద్దంటూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. నీటి సంరక్షణ, నీటి వృథాను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నాం.

చెక్‌డ్యామ్ కూల్చారని రైతుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు వినతి అందజేస్తున్న రైతులు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 338 పరిధిలో గతంలో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణాన్ని కొంతమంది కూల్చారని గ్రామానికి చెందిన రైతులు బుధవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రం అందించారు. గతంలో తమకు చెక్ డ్యామ్ ఉండడం వల్ల బోర్లు, బావుల్లో గ్రౌండ్ వాటర్ పుష్కలంగా ఉండేదని, ఎండాకాలం పశువులు, పంటలకు నీళ్లు ఉండేవన్నారు. అయితే కొంతమంది తమ స్వార్థప్రయోజనాల కోసం ఆ చెక్ డ్యామ్‌ను కూల్చి,ఆ భూమిని సాదాబైనామా సమయాన పాస్‌బుక్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నించే వారికి చెక్‌డామ్ లేదంటున్నారని దీనిపై విచారణ చేసి తగిన న్యాయం చేయాలంటూ వారు ఫిర్యాదు, వినతుల్లో పేర్కొన్నారు.

'వనజీవి' దంపతులకు సన్మానం



వనజీవి దంపతులతో అటవీ ఉద్యోగులు

ఖమ్మంరూరల్: పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య దంపతులను అటవీశాఖ ఉద్యోగులు మండలంలోని రెడ్డిపల్లిలో బుధవారం సన్మానించారు. హైదరాబాద్ దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న బీట్ అధికారులు ఉమ్మడి జిల్లాలో స్టడీ టూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా రామయ్యను కలిసిన వారు సన్మానించగా, ఆయన మాట్లాడుతూ అడవులు, అడవిలో ఉన్న జంతువులను కాపాడాల్సిన బాధ్యత అటవీ శాఖపై ఉందని తెలిపారు. కాగా, విధినిర్వహణలో అమరులైన అటవీ అధికారుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగులకు ఆయుధాలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, ఉమ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ వసతి గృహాలపై చిన్నచూపు

ఖమ్మంమయూరిసెంటర్: సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవనంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్లుగా వసతిగృహ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచడం లేదని, నెలకు బాలికలకు రూ.75, బాలురకు రూ.50 మాత్రమే చెల్లిస్తోందని చెప్పారు. చార్జీలు పెంచాలంటూ ఐదేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలిపినా.. ఇప్పటి వరకు ఆమోదానికి నోచుకోలేదన్నారు. మెస్‌చార్జీలు పెంచాలని గత ప్రభుత్వంలోనే మంత్రుల బృందం నిర్ణయించినా.. ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతోవిద్యార్థులకు నాణ్యమైన భోజనం అందక అర్ధాకలితో గడపాల్సి వస్తుందని తెలిపారు. డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మెనూ ప్రకారం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

భోజనం అందడం లేదన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చెస్తామని హెచ్చరించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు పవన్, అయ్యప్ప, రాకేశ్, రోషన్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏఎంఓ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం శ్రీనివాసా చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ బీవీ రామాచారి, నోడల్ అధికారి వీరస్వామి, పూర్వ హెచ్‌ఎం విక్రమ్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులకు బెయిల్

ఖమ్మంరూరల్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు బెయిల్ లభించడంతో బుధవారం విడుదలయ్యారు. ఖమ్మంకు చెందిన దేవభక్తుని కిషోర్‌బాబు, శివాయిగూడెం మాజీ సర్పంచ్ ప్రదీప్ బెయిల్‌పై విడుదల కాగా, పలువురు నాయకులు వారిని కలిశారు.

సాయి గణేష్ కుటుంబానికి అండగా ఉంటా



సావిత్రమ్మను పరామర్శిస్తున్న వినోద్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: సాయి గణేష్ కుటుంబానికి అండగా ఉంటానని ఖమ్మం బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు భరోసా ఇచ్చారు. నాటి అధికారపక్షం రాజకీయ వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న 46వ డివిజన్‌కు చెందిన బీజేపీ యువనేత సాయిగణేష్ కుటుంబాన్ని బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణతో కలిసి పరామర్శించి, మృతుడి అమ్మమ్మ సావిత్రమ్మకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన కేడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. తొలుత స్తంబాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో వినోద్‌రావుతో పాటు ఆయన కుమారుడు వినిత్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యాన నగరంలోని టీడీపీ కార్యాలయానికి గల్లా సత్యనారాయణతో కలిసి వినోద్‌రావు వెళ్లగా.. తమ పూర్తి మద్దతు ఉంటుందని టీడీపీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంగల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు డి.వెంకటేశ్వరావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్, భద్రం, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ జాతరలో బోనాల సందడి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారంలో శ్రీ అంకమ్మ తల్లి జాతర సందర్భంగా బుధవారం బోనాల పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్దసంఖ్యలో బోనాలు ఎత్తుకుని ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. యువత ఆట, పాటలతో నృత్యాలు చేయడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

'టెట్' దరఖాస్తు ఫీజు తగ్గించాలి

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: తెలంగాణ ప్రభుత్వం భారీగా పెంచిన టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ బషీరుద్దీన్, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేశ్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బషీరుద్దీన్, తిరుమలాయపాలెంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో రమేశ్‌లు మాట్లాడారు. టెట్ దరఖాస్తు ఫీజులు పెంచడం సరికాదని, గత ప్రభుత్వ మాదిరిగా ఈ ప్రభుత్వం తప్పులు చేయొద్దని హితవు పలికారు. అనేక ఆశలతో నిరుద్యోగ యువత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీల విషయం మర్చిపోవద్దని చెప్పారు. నోటిఫికేషన్ల దరఖాస్తు ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు పెంచడం ఏంటని ప్రశ్నించారు. గతంలో టెట్ పరీక్షకు సంబంధించి రూ.300లు ఉండేదని ఇప్పుడు దాన్ని ఒక పరీక్షకు రూ.1,000 చేశారని, రెండు పరీక్షలు కలిపి రూ.2000 అవుతుందని, ఇది నిరుద్యోగులకు భారంగా మారుతుందని అన్నారు. వెంటనే ప్రభుత్వం దరఖాస్తు ఫీజులు తగ్గించాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు. టెట్ నిర్వహణకు జిల్లాకు ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. టెట్ పరీక్ష ఫీజును వెంటనే తగ్గించి అభ్యర్థులకు న్యాయం చేయాలని, లేకపోతే వామపక్ష యువజన, విద్యార్థుల సంఘాల ఆధ్వర్యాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శీలం వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు కూరపాటి శ్రీను, కృష్ణ, సాయి రాజేశ్, హుస్సేన్‌రావు, రమణ, కల్యాణి, పద్మ, సుమతి, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొనగా..తిరుమలాయపాలెంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాదారపు ఉమాశంకర్, బద్రి గురవయ్య, శంకర్, శ్రీకాంత్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంమయూరిసెంటర్: సమావేశంలో మాట్లాడుతున్న బషీరుద్దీన్

ఆలయ ప్రతిష్ఠాపన కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ బాధ్యులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ పరిధి కైకొండాయిగూడెం రోడ్డులో వేంచేసియున్న శ్రీఅంకమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీమద్దిరావమ్మ అమ్మవార్ల పురాతన దేవాలయం పునఃప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 30వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్ము భాస్కర్, ప్రధాన కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు కోశాధికారి గుండోజు రామాచారిలు పేర్కొన్నారు. బుధవారం ఈ మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో వేదిపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక హోమాలు, అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్నదానంతో పాటు ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ, నాగేంద్రస్వామి దేవాలయాల ప్రతిష్ఠ సైతం ఉంటుందని, ఇందుకు యాగం పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాసిరకం సీసీ రోడ్డు పనులపై ఫిర్యాదు

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లి గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ నాసిరకంగా చేపడుతున్నాడని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలె శ్రీనుయాదవ్ బుధవారం జిల్లా పంచాయతీరాజ్ ఈఈ వెంకటరెడ్డికు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. నాణ్యమైన ఇసుక వినియోగించకుండా వాగుల్లో దొరికే ఇసుకతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నాడని ఆరోపించారు. అధికారులు రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇదేం పనులు అని ప్రశ్నిస్తే తనపై దాడులు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ వాసుని వివరణ కోరగా.. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యమైన ఇసుకనే వినియోగిస్తున్నారని, నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పీఆర్ ఈఈకు ఫిర్యాదు చేస్తున్న శ్రీనుయాదవ్

వెలుగుమట్ల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న పడిగ యర్రయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని వెలుగుమట్లలో తమ ఇళ్లకు కరెంట్‌తో పాటు నీటి కుళాయిలను తక్షణమే ఏర్పాటు చేయాలని గ్రామీణ పేదల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య మాట్లాడారు. సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా.. తమకు న్యాయం జరగడం లేదన్నారు. పేదలకు ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం తమ సమస్యలను గాలికొదిలేసిందని, ఇకనైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో జంగం రాంచందర్, షేక్. అక్తరున్నిసాబేగం, దంతోజు సంధ్య, దశరథ్, గంగమ్మ, షేక్.అనీఫా, ఎండీ. సహీనా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన తహసీల్దార్

నేలకొండపల్లి: పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై నిర్లక్ష్యం చేయొద్దని తహసీల్దార్ గౌరీశంకర్ సూచించారు. మండలంలోని ఆచార్లగూడెం, ఆరెగూడెం, కోనాయిగూడెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి కేంద్రాల నిర్వహణకు తగిన ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. అనంతరం జిల్లా సరిహద్దు పైనంపల్లి, రాష్ట్ర సరిహద్దు అప్పలనరసింహాపురం వద్ద ఉన్న చెక్‌పోస్టులను సందర్శించి వాహన తనిఖీలను పరిశీలించారు. ఎంతటి వారైనా వాహనాలను తనిఖీ చేయాల్సిందేనని ఆదేశించారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలస్యం మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.



ఆరెగూడెం పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌరీశంకర్

'ఉపాధి'ని ఎత్తివేసే ఆలోచన విరమించుకోవాలి



మాట్లాడుతున్న బందెల వెంకయ్య

తిరుమలాయపాలెం: ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, అట్టి ఆలోచనను విరమించుకోవాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పిండిప్రోలు రాయల వెంకటనారాయణ భవనంలో జరిగిన పాలేరు డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉపాధి లేక వలసలు వెళ్తున్న క్రమంలో వంద రోజుల పనికి ఆహార పథకం ప్రవేశపెట్టారని అలాంటి పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం బీజేపీ విరమించుకోవాలని అన్నారు. పని ప్రదేశంలో ప్రమాద బీమా కల్పించడంతో పాటు ప్రభుత్వమే వైద్య ఖర్చులు భరించాలని, వ్యవసాయ పనిముట్లు సరఫరా చేయాలని, తాగు నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు, టెంట్లు వేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, పని చేసినా ఇంతవరకు బిల్లులు రాలేదని, వెంటనే బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, పాలేరు డివిజన్ నాయకులు ఈర్ల సూరమ్మ, రాంబాయి, వెంకన్న, రాయిండ్ల చిరంజీవి, ఈర్ల వెంకట అప్పారావు, సుంచు వెంకన్న, చిర్రా భిక్షం తదితరులు పాల్గొన్నారు.